క్లుప్తంగా

డీఈఈ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్ – 1 డీఈఈగా అశోక్ బాధ్యతలను బుధవారం చేపట్టారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, శివయ్య తదితరులు ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

చెక్కు అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష విరాళాన్ని నగరంలోని సమతా నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, సుజాతమ్మ దంపతులు ప్రకటించారు. ఈ క్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంత్రి నారాయణకు అందజేశారు.

కాకాణికి ఘన సన్మానం



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వివిధ ప్రాంతాల నేతలు బుధవారం సత్కరించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.

హామీని నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు నూతన మద్యం పాలసీలో గౌడ కల్లు గీత సొసైటీలకు పది శాతం షాపులను కేటాయించాలని బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. కల్లు గీత సొసైటీలకు కాకుండా బినామీలకు కేటాయిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. పార్టీ ఓబీసీ మోర్చా నేతలు కోసూరు బాలయ్యగౌడ్, వెంకటసుబ్బయ్య, దీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యానికి నివాళి



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని సినీ ఆర్కెస్ట్రా మ్యూజీషియన్స్ అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు సుస్వర రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయకులు భాను, లక్ష్మి, స్వరూప, జ్యోతి, ఆది తదితరులు ఆలపించిన గీతాలు అలరించాయి. ఆర్టీఓ మలోల, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, అడ్వొకేట్ శ్రీరామకవచం శ్రీధర్, పేరూరి ప్రదీప్, కలువకూరి కృష్ణారెడ్డి, లక్కీ.రాయల్, వాసవి ఆర్కెస్ట్రాల ఆర్గనైజర్లు ఇమ్మారెడ్డి పెంచలరెడ్డి, భాస్కర్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సీఐకి జ్ఞాపిక ప్రదానం

నెల్లూరు(అర్బన్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దిశ పోలీస్‌స్టేషన్ సీఐ రామారావు సూచించారు. యలమవారిదిన్నె పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అక్కడికి వచ్చే రహదారుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్నెస్సెస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం స్థానికులకు వైద్యసేవలందించారు. తదుపరి సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని జరిపారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్, అడాప్టేషన్ చైర్‌పర్సన్ మాధవి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, నిర్వహణాధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): బట్వాడిపాళెం కూడలి నుంచి డైకస్‌రోడ్డు వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో సుందరీకరణకు ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగాధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షపునీరు పారేందుకు అనువుగా డ్రెయిన్ల నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, పచ్చదనం, గ్రిల్స్ తదితరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన ప్రణాళిక మేరకు నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ, నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, కార్పొరేషన్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టాలని, రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయ ప్రాంగణాన్ని ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్లపై మురుగు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు తోడేయాలని ఆదేశించారు. భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకుల్లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సమీపంలోని మురుగ నీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్ఈ సంపత్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు



గోశాలకు ఆవుల తరలింపు

నెల్లూరు(బారకాసు): ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, పాత మున్సిపల్ కార్యాలయం, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న ఎనిమిది గోవులను కల్లూరుపల్లిలోని గోశాలకు బుధవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను గోశాలకు తరలిస్తామని చెప్పారు.

ఎట్టకేలకు తెరుచుకున్న విజిటర్స్ హాల్



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలోని విజిటర్స్ హాల్ తాళాలను ఎట్టకేలకు తీశారు. విజిటర్స్ హాల్‌కు తాళాలేసి ఉండటంతో కార్పొరేషన్ కార్యాలయానికి వస్తున్న వారు ఇబ్బంది పడుతున్న అంశమై సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. దీంతో విజిటర్స్ హాల్‌కు వేసిన తాళాలను అధికారులు తీశారు. దీనిపై ఇక్కడికి వచ్చిన వారు ఆనందం వ్యక్తం చేశారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు స్పందన



నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించిందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తొలుత దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షకు జిల్లాలోని 33 మండలాల నుంచి 36 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సహచరులు ఆర్థిక చేయూతనందించారు. మూడో మైలుకు చెందిన కృష్ణ 2009 బ్యాచ్ కానిస్టేబుల్. ఇందుకూరుపేటలో పనిచేస్తూ గత నెల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి తమ వంతు చేయూతనందించేందుకు గానూ సహచర కానిస్టేబుళ్లు ముందుకొచ్చారు. రూ.1.77 లక్షలను సేకరించి కృష్ణ తల్లిదండ్రులకు అందజేశారు. కానిస్టేబుళ్లు మస్తాన్, అరుణ్, సంతోష్, సురేష్, శివ, అల్లాబక్షు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ అభివృద్ధే లక్ష్యం



నెల్లూరు (సెంట్రల్): అందరూ కలిసికట్టుగా విజయ డెయిరీని అభివృద్ధి చేస్తామని నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు అన్నం శ్రీహరి, కోట చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని విజయ డెయిరీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. మూడు డైరెక్టర్ పోస్టుల ఏకగ్రీవానికి సహకరించిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు.

పార్వతమ్మ మరణం బాధాకరం



నెల్లూరు సిటీ: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మరణం తనకెంతో బాధ కలిగించిందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సరస్వతీనగర్‌లోని వారి నివాసంలో మాగుంట పార్వతమ్మ పార్థీవదేహానికి బుధవారం నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లా వాసులు ఆమెను ఎప్పటికీ మర్చిపోరని చెప్పారు. ఆమెపై ఎన్నికల్లో పోటీ చేయడం కొంత బాధ కలిగించిందని, అయితే పోలింగ్ మరుసటి రోజు పార్వతక్క తనకు ఫోన్ చేసి మాట్లాడిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.

ఎస్పీ బాలు వర్ధంతి



నెల్లూరు(బృందావనం): పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని ఆదిత్యనగర్‌లోని బాలసుబ్రహ్మణ్యం పార్కులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాంజలి ఆర్కెస్ట్రా, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ప్రసాద్, నాగరాజారావు, సతీష్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు



నెల్లూరు(క్రైమ్): రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు హెచ్చరించారు. ఆచారివీధి, పెద్దబజార్‌లో చికెన్ విక్రయ దుకాణాలు తదితరాలు రోడ్లపైకి చొచ్చుకురావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై దృష్టి సారించిన ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఆక్రమణలను తొలగించారు. రోడ్లను ఆక్రమించినా.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): కోట ఏవీకేఆర్ జెడ్పీ హైస్కూల్లో 1968 – 69 మధ్య పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నజీర్, చాకీబాన్, చిన్నారెడ్డి, నారాయణ, సందానీబాషా, చంద్రశేఖర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ మంత్రికి స్వాగతం

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు చేరుకున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు టూరిజం అధికారులు స్వాగతం పలికారు. పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం రాజు, డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, డీఈ వంశీకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



నెల్లూరు(బృందావనం): విజయవాడ వరద బాధితుల సహాయార్థం నెల్లూరులోని మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేతలు గ్రోసు సుబ్బారావు, గ్రోసు మురళీకృష్ణ రూ.ఐదు లక్షలను ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

టీపీఆర్వోగా బాలకృష్ణ



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ టీపీఆర్వోగా బాలకృష్ణను నియమిస్తూ కమిషనర్ సూర్యతేజ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. వాస్తవానికి తిరుపూరు మున్సిపల్ కమిషనర్‌గా డిప్యుటేషన్‌పై నియమితులయ్యారు. అయితే ఎన్నికల సందర్భంగా ఈయన్ను తిరిగి తన మాతృస్థానానికి పంపారు. అప్పటి నుంచి ఏ స్థానాన్నీ కేటాయించలేదు. ఎట్టకేలకు టీపీఆర్వోగా నియమించారు. కాగా బాధ్యతలను గురువారం ఆయన చేపట్టనున్నారు.

46వ డివిజన్లో పారిశుధ్య పనులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 46వ డివిజన్లో గల పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు కాలువల్లో పూడికను బుధవారం తొలగించారు. వీటిని కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ పర్యవేక్షించారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): రెండోసారి కుమార్తె పుట్టిందని భార్యను వేధించిన భర్త, అత్తింటివారిపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టలోని విఘ్నేశ్వరపురానికి చెందిన జయలక్ష్మికి చెన్నైకు చెందిన శక్తివేలన్‌తో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె పుట్టిన నాటి నుంచే భర్త, అత్తింటి వారు ఆమెను వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. వీటిని తాళలేక ఈ ఏడాది జనవరిలో పుట్టింటికెళ్లారు. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్దే ఉంటూ కాపురానికి తీసుకెళ్లాలని భర్తను ప్రాధేయపడ్డారు. దిశ పోలీసులు కౌన్సెలింగ్ చేసినా ఫలితం లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శక్తివేలన్, మరో ఇద్దరిపై ఎస్సై అబ్దుల్ రజాక్ కేసు నమోదు చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సత్కారం



నెల్లూరు(దర్గామిట్ట): జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఆనం అరుణమ్మ మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమెను జెడ్పీ కార్యాలయ సిబ్బంది బుధవారం సత్కరించారు. ఆనం అరుణమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు.

సెక్యూర్టీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఏటీఎం కేంద్రాల వద్ద సెక్యూర్టీ గార్డులను విధిగా ఏర్పాటు చేసుకోవాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో వివిధ బ్యాంక్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రివేళల్లో బీట్ సిబ్బంది తమ పరిధిలోని ఏటీఎం కేంద్రాలను సందర్శించి అక్కడి రిజిస్టర్‌లో సంతకం చేయాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు అభినందనలు





నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఏపీ స్టేట్ ఎమ్మెస్సెమ్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఎస్సీ సెల్ నేత శ్రీహరి, పార్టీ నేత కల్లూరు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



వివరాలను తెలుసుకుంటున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని వెటర్నరీ విభాగాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకొని వాటికి వ్యాక్సినేషన్ వేసి శస్త్రచికిత్సల అనంతరం తిరిగి అదే చోట వదిలేలా చర్యలు చేపడతామని చెప్పారు. వీధి కుక్కల సమస్యపై తమకు తెలియజేయాలని కోరారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, శానిటరీ సూపర్‌వైజర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెకు మద్దతు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(అర్బన్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీల్లో సమ్మె చేపట్టిన డాక్టర్లకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్ పేర్కొన్నారు. శాంతినగర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ల న్యాయమైన డిమాండ్ పీజీ ఇన్ సర్వీస్ కోటాను యథావిధిగా కొనసాగించాలని కోరారు. నేతలు వరప్రసాద్, సుల్తాన్‌బాషా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



నెల్లూరు(అర్బన్): రోగులకు నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని ప్రభుత్వ పెద్దాస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్స్ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు రూ.వెయ్యి నగదుతో పాటు జ్ఞాపికలను బుధవారం అందజేసి సత్కరించారు. ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీస్ ఫౌండర్ డాక్టర్ గ్లోరీ, సెక్రటరీ జయప్రకాష్, కోశాధికారి సిరి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ ఆంథోనీ మేరీ తదితరులు పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మకు నివాళి

నెల్లూరు(బారకాసు): సరస్వతీనగర్‌లోని నివాసంలో మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ పార్థీవదేహానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం నివాళులర్పించారు.

నెల్లూరు(అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో గల ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో మానసిక దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నివాళులర్పించారు. పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఎమ్సీ మెంబర్, అడ్వైజర్ దాసరి రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మస్తానయ్య, ప్రిన్సిపల్ గురునాథం, ఏఓ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాగుంట పార్వతమ్మ పార్థీవదేహానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్ తదితరులు నివాళులర్పించారు.





నివాళులర్పిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, అరుణమ్మ, వేమిరెడ్డి దంపతులు, చంద్రశేఖర్‌రెడ్డి





డీసీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని చేనేత సహకార సంఘ పాలకవర్గ సభ్యుల వివరాలు, వారి పేర్లతో ఓటర్ల జాబితాను రూపొందించాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో సహకార, చేనేత, జౌళి శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని సూచించారు. చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్‌ను నిర్మించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్లో గల వెంకటేశ్వరపురంలో అండర్ పాస్‌ను నిర్మించి గాంధీ గిరిజన కాలనీ వాసుల ఇబ్బందులను తీర్చాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నగరంలోని శెట్టిగుంటరోడ్డులో గల మాలకొండారెడ్డి భవన్‌లో డివిజన్ మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ్ ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం డివిజన్ శాఖ కార్యదర్శిగా గడ్డం శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ నేతలు మస్తాన్‌బీ, మస్తాన్, వెంకటేశ్వర్లు, బయ్యన్న, సుబ్రహ్మణ్యం, మణి, రమేష్, దస్తగిరి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గిరీష్ మృతికి సంతాపం

నెల్లూరు(అర్బన్): చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్‌గా సేవలందిస్తూ అనారోగ్యంతో నల్లగండ్ల గిరీష్ మృతి చెందడం బాధాకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశాన్ని రైల్వేఫీడర్స్ రోడ్డులోని వెటర్నరీ పాలి క్లినిక్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించనున్నామని ఏపీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిధర్‌బాబు, విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.